Office Of The Advisor (Communications)
Govt. Of Andhra Pradesh

# భూసేకరణ కుదరకుంటే

# భూగర్భ పైపులైన్లు

## ప్రాజెక్టులు సత్వరం పూర్తి చేయడమే లక్ష్యం

## అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

అమరావతి, మార్చి 5 : రాష్ట్రంలో తలపెట్టిన ప్రాధాన్య ప్రాజెక్టులతో సహా ఇతర ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రధాన ఆటంకంగా మారిన భూసేకరణ సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు ఉత్తమ పరిష్కారమార్గాన్ని సూచించారు. భూసేకరణకు బదులుగా భూగర్భ పైపులైన్లు వేయడం ద్వారా ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. భూగర్భమార్గంలో పైపులైన్లు వేయడం వల్ల ఎవరి అనుమతి అవసరం వుండదని, అలాగే భూసేకరణకు అయ్యే వ్యయం కూడా ఆదా అవుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. సోమవారం సచివాలయంలో పోలవరం సహా ప్రాధాన్య ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

### మరో 20కి పైగా ప్రాధాన్య ప్రాజెక్టుల గుర్తింపు

ఇప్పటికే 28 ప్రాధాన్య ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ముఖ్యమంత్రి, మరో 20కి పైగా ప్రాజెక్టులను ఈ జాబితాలో చేర్చాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే చేపట్టిన 28 ప్రాధాన్య ప్రాజెక్టులలో చాలావరకు పూర్తికావస్తున్నందున కొత్త ప్రాజెక్టులను వచ్చే ఏడాదిలోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.

గోదావరి–పెన్నా అనుసంధానం మొదటి దశ, మహేంద్రతనయ, జీఎన్ఎస్ఎస్ రెండో దశ, వెలిగొండ 1, 2 సొరంగాలు, వైకుంఠపురం బ్యారేజ్, స్వర్ణముఖి–సోమశిల, మల్లెమడుగు, శ్రీ బాలాజీ రిజర్వాయర్, వేణుగోపాల్ సాగర్, హీరమండలం–ఇచ్ఛాపురం–సోంపేట, జీడిపల్లి–భైరవానితిప్ప, మూలపల్లి–కుప్పం, పాలేరు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ఆల్తూరుపాడు సహా 20కి పైగా ప్రాజెక్టులను

ముఖ్యమంత్రి ప్రాధాన్య ప్రాజెక్టులో చేర్చాల్సిందిగా సూచించారు. వీటికి అంచనాలను తక్షణం రూపొందించి, ఏయే ప్రాజెక్టును ఎప్పటికల్లా పూర్తి చేయాలో లక్ష్యం నిర్దేశించుకుని, టెండర్లను త్వరితగతిన పిలవాలని చెప్పారు. తాజా జాబితాతో ప్రాధాన్య ప్రాజెక్టుల సంఖ్య 50కు చేరుకుంది.

అలాగే తారకరామ తీర్థ సాగరం, వెలిగొండ ప్రాజెక్టులను ఈ సీజన్ కల్లా పూర్తి చేయాలని, ఈ ఏడాది వర్షాకాలం నాటికి నీటిని విడుదల చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. నాగావళి కాలువలు అభివృద్ధి చేసి 110 ఏళ్లు కావస్తున్నందున వాటిపైనా దృష్టి పెట్టాలని తెలిపారు.

వచ్చే ఏడాది కల్లా రాష్ట్రంలో భూగర్భజలాలు కనీసం 15 మీటర్ల మేరకైనా వుండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. ఉద్యానవనాల సాగు విస్తీర్ణాన్ని గుర్తించాలని, రాష్ట్రంలో ఎంతవరకు తాగునీరు, సాగునీరు, పరిశ్రమలకు నీరు అవసరం వుందో లెక్కలు తేల్చాలని చెప్పారు.

## పోలవరం ప్రాజెక్టు డిజైన్లకు ప్రత్యేక అధికారి

పోలవరం ప్రాజెక్టులో వివిధ పనులకు సంబంధించి ఇంకా మిగిలి వున్న డిజైన్లను శరవేగంగా రూపొందించి, కేంద్రం నుంచి ఆమోదం పొందేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. డిజైన్ల రూపకల్పనకు, పర్యవేక్షణకు ప్రత్యేకంగా అధికారిని నియమించాలని చెప్పారు. 2018 జనవరి వరకు పోలవరం ప్రాజెక్టు కోసం రూ. 13,053.91 కోట్లు ఖర్చు చేయగా, జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన అనంతరం రూ. 7,918.04 కోట్లు ఖర్చు చేసినట్టు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. ఇందులో ఈ ఏడాది ఫిబ్రవరి 9 వరకు కేంద్రం రూ. 4,932.26 కోట్లు కేంద్రం ఇచ్చిందని, మరో రూ. 2,985.78 కోట్లు ఇవ్వాల్సి వుందని చెప్పారు.

గడిచిన వారం రోజుల్లో 24 వేల క్యూబిక్ మీటర్ల మేర మట్టితవ్వకం పనులు చేపట్టగా, 11 వేల క్యూబిక్ మీటర్ల మేర స్పిల్ వే, స్టిల్లింగ్ బేసిన్ కాంక్రీట్ పనులు పూర్తి అయ్యాయని, డయాఫ్రమ్ వాల్ 7.6 మీటర్ల వరకు నిర్మాణం జరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

పోలవరం ప్రాజెక్టులో మొత్తంమీద 1115.59 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను ఇప్పటివరకు 777.54 లక్షల క్యూబిక్ మీటర్లు మేర తవ్వకం పనులు పూర్తయ్యాయి. స్పిల్ వే, స్టిల్లింగ్ బేసిన్, స్పిల్ చానల్‌కు సంబంధించి 35.14 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు కాంక్రీట్ పనులు చేపట్టాల్సి వుండగా, ఇప్పటికి 5.4 లక్షల క్యూబిక్ మీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. 1,427 మీటర్లు పొడవైన డయాఫ్రమ్ వాల్‌కు గానూ 1011.6 మీటర్ల వరకు నిర్మాణం పూర్తయ్యింది.

మరోవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 1,62,739 ఎకరాలు భూసేకరణ చేస్తుండగా ఇప్పటివరకు రూ. 4,922.76 కోట్లు చెల్లించి 1,02,480.90 ఎకరాలు సేకరణ పూర్తి

**చేశామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఇంకా 60,258.10 ఎకరాల భూసేకరణ జరపాల్సి వుందని, ఇందుకు రూ. 28,302.98 కోట్లు అవసరమవుతాయని చెప్పారు. త్వరితగతిన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ పనుల పురోగతిపై వచ్చే వారం నుంచి వారంవారం నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు.**

**సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రాజమౌళి, ఈఎన్‌సీ వెంకటేశ్వరావు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.**